## పేరు మీరే పెట్టండి

అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.

సాయంత్రం అయిదు అవుతుంది. ప్రతిరోజు సాయంకాలం మా ఇంటి వరండాలో నిల్చోడం నాకీ మధ్య బాగా అలవాటైంది. అందుక్కారణం మా ఎదురింట్లోకి క్రొత్తగా వచ్చిన కుటుంబం. అయితే ఇంత క్రితం ఆ ఇంట్లో ఎవరూ క్రొత్తగా రాలేదని కాదు. అప్పుడు నేనిలా వరండాలో నిల్చోలేదు.

ఇప్పుడు చేరిన వాళ్ళింట్లో ఓ అమ్మాయి ఉంది. ఈ అమ్మాయి అందరమ్మాయిల్లా నా వైపు జాలిగా చూడదు- ఆర్తిగా, అభిమానంగా చూస్తుంది.

ఆ అమ్మాయి ప్రతిరోజు సాయంకాలం మల్లిపూలు కోయడానికివచ్చి, వాటిని అక్కడే మాల కట్టి ప్రక్క వీధిలోని ఆంజనేయస్వామి గుడికి తీసికెళ్తుంది. మధ్య మధ్యలో నావైపు అలా అలా చూసి ఇలా చూపులు తిప్పుకుంటుంది. ఆమె నావంక ఎంతకీ చూడకపోతే నా కళ్ళలోని కాంతి కిరణాలు వేడిగా వెళ్ళి నా అసహనాన్ని తెలియచేస్తే నా వైపు ఓ చూపు అలా విసిరి నా బాధ తీరుస్తుంది.

ఈ రోజు ఆమెతో ఎలాగైనా మాట్లాడాలనుకున్నాను. అందుకే ఆమె వెంట నేను కూడా గుడికి బయలు దేరాను. పూజ ముగించుకొని ఇంటికి బయలుదేరింది.

"ఏమండి"! అంటూ పిలిచాను. ఎవరా అనుకొని వెనక్కి తిరిగింది.

"నమస్కారమండీ!" అంటూ ఎడమ చేత్తో నమస్కారం చేశాను. ఆవిడ కూడా నమస్కారం చేస్తున్నట్లు చేతులెత్తి అటూ ఇటూ చూసింది బెదురుగా.

"నా పేరు రాము. మీ ఎదురింట్లో ఉంటున్నాను. మీకు తెలుసనుకుంటాను?"

తెలుసన్నట్లు తల వూపింది.

"నేను గ్రాడ్యుయేట్ నండి! జర్నలిస్ట్‌గా పన్చేస్తున్నాను. చిన్నప్పటినుండి ఎడమ చేయి అలవాటు కావడం-వలన ఆ ఉద్యోగమన్నా దొరికింది!"

మళ్ళీ ఇటువంటి సమయం దొరుకుతుందో లేదోనన్నట్లుగా వాగేస్తున్నాను.

"మీ కేమన్నా బోర్ కొడ్తున్నానా?" ఇంతకి మీ పేరు చెప్పనే లేదు?"

దిగ్గున తలఎత్తింది. ఆ కళ్ళల్లోన్నీ కరు చెప్పాలన్న వేదన, చెప్పలేకపోతున్నందుకు ఆ వేదన చకచకా ఇంట్లోకెళ్ళిపోయింది.

కోపం వచ్చిందేమో? పేరడక్కుండా ఉండాల్సింది. ఎందుకలా వెళ్ళిపోయిందో?

రాత్రి అమ్మ చెప్పిన విషయం విని నేను పాతాళంలోకి కుంగిపోయినట్లు బాధపడ్డాను.

మరుసటి రోజు గుడి నుంచి వస్తూ నేను పిలవకున్నా తానే వచ్చి ఓ చీటీ ఇచ్చింది. అందులో 'నా పేరు కీర్తన' అని ఉంది.

"క్షమించండి. మీ విషయం అమ్మ చెప్పేవరకు నాకు తెలీదు." పర్వాలేదన్నట్లుగా చూసింది. పాపం, ఎంత బాధ పడిందో! "మనకీలోకం మనం మోయలేనంత జాలిని చూపిస్తుందే కాని, కావలసినంత సహాయం చేయలేదు. అవిటివాడి బాధ అవిటివాడికే తెల్సు. అందుకే నేను మిమ్మల్ని పెళ్ళిచేసుకుంటాను- మీకిష్టమైతేచెప్పండి!" అన్నాను, ఒప్పుకోక పోతుందా అన్న చిరు ఆశతో.

కీర్తన దిగ్గున తలఎత్తింది.

"మీ మనసుని నొప్పించి ఉంటే మన్నించండి. ఈ అవిటివాన్ని చేసుకోడానికి ఎవరూ ముందుకు రారని తెలుసు.

ప్రేమ పేరుతో సినిమాలకి, పార్కులకి వెళ్ళేంత పరిచయం లేకపోయినా, చూపులతో జీవితానికి సరిపడే అనుభవాల్ని పంచుకున్నాము.


ప్లీజ్, నా అభ్యర్థనని అర్థం చేసుకోండి. మీ అభిప్రాయం చెప్పండి!" కీర్తన కళ్ళు స్థిరంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా ఉన్నాయి.

ఇపుడు మమ్మల్నందరూ చిలకా గోరింకల్లా ఉన్నామంటారు! అఫ్‌కోర్స్. వాటిలా మేము పాడలేకపోవచ్చు. ఎగరలేకపోవచ్చు.

—ప్యాపలి శ్రీరాములు

స్రవంతి నెం: 11లో ఈ శీర్షికలో ప్రచురించిన కథకి రచయిత శ్రీ బి.రఘురామరాజు పెట్టిన పేరు: దొంగలకు దొంగ.

ఈ వారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ : శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి.



ఆకాశవాణిలో పదిహేనేళ్ళుగా పని చేస్తూ పాతికేళ్ళుగా అసంఖ్యాకమైన కథల్ని, నాటికల్ని, నాటకాల్ని, ఓ రెండు మూడు సినిమాలకి కథ, మాటల్ని రచించి, అనేక నాటకాల్లో నటించి-ఇటు కలం ద్వారానేకాక అటు గళం ద్వారా కూడా అఖిలాంధ్ర పాఠకులకి, శ్రోతలకి పరిచయమైన సహృదయులు శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి "ఓ పాటకి బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ఎంత అవసరమో కథలకి భాషాపరమైన అవగాహనకూడా అంతే అవసరం" అని నమ్మిన వీరు "సాధన చేస్తూ, కొన్ని విషయాల్లో ఇంకొంచెం శ్రద్ధ తీసుకుంటే, ఈ కథలు రాసిన వారి నుంచి చాలా మంది రచయితలు పుట్టుకొస్తారని" అభిప్రాయం వెలిబుచ్చారు.

## మంచివాడు

ప్రభాకర్ మనసంతా ఏదో గజిబిజిగా వుంది. ఇదీ అని చెప్పలేని ఏదో అనీజీనెస్. తనకూ ఓ వదిన రాబోతుందన్న మాట విన్నప్పటినుండీ మనసు మనసులోలేదు.

ఇప్పుడు వదినగారొస్తే అదికూడ మిగలదు కాబోలు. అవును, అంతే జరుగుతుంది. తన ఫ్రెండ్ భాస్కర్‌గాడి వదినలాగే తనకు రాబోయేవదినకూడా తననీ, అక్కయ్యనీ తన్ని బయటికి తరిమేస్తే తన బ్రతుకుకేమిటి? తను కూడా వాడిలాగా హోటల్‌లో సర్వర్‌గా చేరిపోవాలా? అపుడు శాంతక్కగతేమిటి! భాస్కర్‌గాడి అక్కలాగా ఎవడితోనైనా లేచిపోతుందేమో! అలా తలచుకుంటుంటూనే చాల అసహ్యమేసింది ప్రభాకరానికి.

తనకు తెలిసినంత వరకూ ఎవరి వదినలు కూడా ఇంట్లో వ్యక్తుల్ని సవ్యంగా చూచినట్లు గుర్తులేదు.

**స్రవంతి నెం: 9లో ఇచ్చిన వాక్యం "తమ్ముడూ నీ పెళ్ళయితేనే కాని నేను చేసుకోనురా" అన్నాడు సుధాకర్. ఆధారంగా రాసిన కథలు**

లేదు సుధాకర్. చిన్న వయసులోనే తండ్రితో పాటు తల్లిని కోల్పోయారన్న సానుభూతితో చేతనైనంత వరకూ బాధలు తెలియకుండా పెంచుకొస్తున్నాడు. ఇంటర్ పూర్తికాగానే శాంతికి పెళ్ళిచేసి పంపించేయాలని అనుకుంటున్నాడు కూడా! ప్రభాకర్ పదోతరగతి చదువుతున్నాడు.

ఇప్పుడు వదినొస్తే తననింక చదువుకో నివ్వదేమో, చదువు మానడం తనకిష్టంలేదు. పెద్ద పెద్ద చదువులు చదువుకోవాలి. ఆలోచనలతో కొట్టుమిట్టాడుతున్న ప్రభాకర్‌కి చట్టుక్కున ఓ ఆలోచన వచ్చింది.

"అయ్యా! మీ కోసమెవరో వచ్చారు" అటెండరు రామయ్య క్లాసు మధ్యలో వచ్చి చెప్పాడు. తనకోసం వచ్చేవాళ్ళెవరబ్బా అనుకుని, ఇప్పుడే వచ్చేస్తాను అల్లరి చేయకండని పిల్లలకు చెప్పి బయటకు నడిచాడు సుధాకర్. గేటు దగ్గర నిలబడిన ఆదిశేషయ్యగార్ని చూసి ఆశ్చర్యపోయాడు. "మీరా. ఏమిటిలా వచ్చారు?" ఆశ్చర్యంగా అడిగాడాయన్ని. వారం క్రితం తనకి పిల్లనిస్తానంటూ వచ్చాడాయన. తనకిప్పుడా ఆలోచనలేదనీ, నిదానంగా ఆలోచించి ఏసంగతీ ఉత్తరం రాస్తాననీ, చెప్పాడు సుధాకర్....మరి మళ్ళీ వచ్చాడెందుకు? అర్థం కాలేదు సుధాకర్‌కి.

ఆయనేం మాట్లాడకుండా జేబులోంచి ఓ ఉత్తరం తీసి ఇచ్చాడు. ఆ ఉత్తరం విప్పి చూశాడు సుధాకర్. అందులో ప్రభాకర్ చేతి వ్రాతని సులభంగానే గుర్తించాడు. అతడి కళ్ళు గబగబా ఆ వాక్యాలవెంట పరుగెత్తాయి.

ఉత్తరం చదవడం ముగించిన సుధాకర్ ముఖం కందగడ్డలా ఎర్రగా మారిపోయింది. అప్పటికప్పుడు ప్రభాకర్ని పట్టుకుని నాలుగు తన్నాలనిపించింది. తలెత్తి చూసిన సుధాకర్‌కి దూరంగా గేటుదాటుతున్న ముసలాయన కన్పించాడు.

సాయంకాలం స్కూలునుండి ఇంటి కెళ్తూనే, "ప్రభా, ఒరే ప్రభా, ఎక్కడ చచ్చావ్ త్వరగా రా" అని గావుకేకలు పెట్టాడు. 'ఏంటన్నయ్యా?' అంటూ శాంత, ప్రభాకర్ చెరో వైపూ పరుగెత్తుకొచ్చారు. వాళ్ళ బుద్ధి తెలిసింది మొదలు సుధాకర్ అంతగట్టిగా అరవడం ఎప్పుడూ గమనించలేదు.

"ఇలారా" కుర్చీలో కూర్చుంటూ పిలిచాడు ప్రభాకర్ వైపుచూసి. అయోమయంగా చూస్తూ దగ్గరగా వచ్చాడు ప్రభాకర్. జేబులో నుండి ఉత్తరంతీసి "ఏమిటిది?" అడిగాడు. కోపాన్ని కంఠంలో కన్పించకుండా జాగ్రత్త పడ్డాడు.

ప్రభాకర్‌కి సంగతేమిటో అర్థమైపోయింది, తను ఆదిశేషయ్యకి రాసిన ఉత్తరమది. అన్నయ్య చేతికెలా వచ్చిందో. బెరుగ్గాచూపి తల దించుకున్నాడు. "ఎందుకు వ్రాశావిలా? నాకు సమాధానంకావాలి!" ఖచ్చితంగా అడిగాడు సుధాకర్.

"నువ్వు మంచివాడివి కాదనిచెప్తే నీకు వాళ్ళు అమ్మాయిని ఇవ్వరు కదా! అందుకని అలా వ్రాశాను". తల వంచుకుని చెప్పాడు ప్రభాకర్.

"వదిన వస్తే నన్నూ, శాంతక్కయ్యనీ బయటికి తరిమేస్తుందిగా" బావురు మన్నాడు ప్రభాకర్ అన్నయ్యని పట్టుకుని.

"ఎందుకు తరిమేస్తుందమ్మా" అనునయంగా వీపు నిమిరాడు సుధాకర్.

మరి మా ఫ్రెండ్ భాస్కర్‌గాడి వదిన అలాగే చేసిందిగా? అందరి వదినలూ అలానే చేస్తారుట. మా శీను కూడా చెప్పాడు

ఆమాటలు వినగానే మనసంతా జాలితో నిండిపోయింది సుధాకర్‌కి. "ఎవరో వదినొచ్చి చెబితే నేను మిమ్మల్ని తరిమేస్తానని ఎలా అనుకుంటావోయ్ పిచ్చి నాగన్నా! నన్ను చూస్తే అలా అన్పిస్తోందామీకు? మొదట శాంతకి పెళ్ళి చేయాలి. అంతేకాదు తమ్ముడూ! నీ పెళ్ళయితేనేకాని, నేను కూడా పెళ్ళిచేసుకోను సరేనా." అన్నాడు సుధాకర్.

"నిజంగానా మా అన్నయ్య ఎంత మంచివాడోచ్" అంటూ పసిపిల్లాడిలా సంతోషపడిపోతోన్న ప్రభాకర్ని చూసి మనస్ఫూర్తిగా నవ్వుకున్నాడు సుధాకర్.

—డి. ప్రభావతి
(తిరుపతి)

# సోదర ప్రేమం

"అబ్బా!" నిస్సత్తువగా కుర్చీలో కూలబడ్డాడు సుధాకర్. డాక్టర్ రిపోర్ట్ వల్ల తెలుసుకున్న చేదునిజం, అతని మనసులో పదే పదే మెదలుతోంది. నిజంగా అలాగే జరిగితే, అమ్మో! ఇంకేమన్నా వుందా? అలా జరగటానికి ఎంతమాత్రం వీలులేదు.

"ఎందుకన్నయ్యా, పిలిచావట"? అడిగాడు రత్నాకర్, అతనికిమనసులో భయంగానేఉంది. నిన్నతనూ, సంధ్యా, పార్కులో కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకోటం, అన్నయ్య కళ్ళబడింది. అన్నయ్య చీవాట్లేస్తాడేమోనని భయపడుతూ నిల్చున్నాడు.

ఏం సమాధానం చెప్పాలో తెలియక తల దించుకున్నాడు రత్నాకర్. "చూడు రత్నా! నాన్నగారు లేరుగాబట్టి, ఈ కుటుంబం పెద్దగా, నేను చెప్పినదాన్ని నువ్వు ఆదరించితీరాలి"

"అన్నయ్యా!" సంధ్యతో తన స్నేహాన్ని విడదీస్తాడేమోనని బాధపడుతూఅన్నాడు.

"అవునురా, తనకు కోడలు వస్తే, విశ్రాంతి తీసుకోవాలని అమ్మ ఆశపడుతున్నది. రేపు ఒకసారి ఆ అమ్మాయిని ఇంటికి తీసుకురా. అమ్మ ఓ.కె. అంటే మిగిలినవి నేను చూసుకుంటాను". రత్నాకర్‌కి ఆనందంతో ఎగిరి గంతెయ్యాలనిపించింది. అయినా ఇదేమిటి, అన్నయ్య తన పెళ్ళిమాట ఎత్తుకోకుండా, మా పెళ్ళి జరిపిస్తానంటున్నాడు?

"నువ్వు మా పెళ్ళికి ఒప్పుకున్నందుకే చాలా సంతోషం అన్నయ్యా! అయినా, నీగురించి ఏమీ చెప్పకుండా, మా పెళ్ళికి తొందర పడుతున్నావేంటి? కొత్త పెళ్ళికూతురు హోదాలో అడుగుపెట్టే సంధ్యకు హారతిచ్చి, ఆప్యాయంగా లోపలకు తీసుకువెళ్ళవలసినది, సీతమ్మలాంటి మా వదినకదా! ఇన్నాళ్ళూ ఎలాఅడగాలో తెలియక వూరుకున్నాను. వదినను నువ్వు ముందే సెలెక్టు చేసుకుని, మమ్మల్ని సర్‌ప్రైజ్ చేద్దామని చూస్తూన్నావుకదూ! ఇంకెందుకన్నయ్యా దాగుడు మూతలు. లైన్ క్లియరిచ్చేయ్. మేం కూడా హాయిగా పెళ్ళి చేసుకుంటాం!" నవ్వుతూ అన్నాడు రత్నాకర్.

"తమ్ముడూ! నీపెళ్ళయితేగాని నేను చేసుకోనురా" నెమ్మదిగా అన్నాడు సుధాకర్. రత్నాకర్ ఆశ్చర్యపోతూ," అదేమిటన్నయ్యా! ముందు మా పెళ్ళి జరగటానికి నేనెలా ఒప్పుకుంటాననుకున్నావు? నువ్వు ఎందుకు చేసుకోనంటున్నావో కారణం చెప్పి తీరాలి" పట్టుపట్టాడు. "వేరే కారణం ఏముందిరా? నువ్వు, సంధ్య చనువుగా వుంటున్నారు. అదివేరే అనర్థానికి దారితీయకుండ, మీ ఇద్దరి పెళ్ళి జరిపించేద్దామని, నేనింకా పెళ్ళికూతుర్ని వెతికోవాలి. అమ్మకు నచ్చాలి. ఈ తతంగంమంతా వుంది కదా. ఏమంటావు?" అన్నాడు. సుధాకర్ ప్రతిపాదనను అయిష్టంగానే ఒప్పుకున్నాడు రత్నాకర్.

'అమ్మయ్య! ఈ రెండురోజుల నుండి నేను పడ్డటెన్షన్ ఇప్పుడు తగ్గింది. ఇంక నా జీవితం ఏమైన ఫరవాలేదు.

ఓకేన్సర్ మహమ్మారీ! మా రత్నా పెళ్ళి జరిగే వరకూ విజృంభించకు. తరువాత నేనే నీకు లొంగిపోతాను". బాధగా అనుకున్నాడు, కేన్సర్ వ్యాధికిగురై, ఇంక కొద్ది నెలల్లోనే తనకు మృత్యువు తప్పదని తెలుసుకున్న సుధాకర్.

—సి. రాధికా కృష్ణ
(భీమవరం)

**ఓ కథ రాయండి**

ఈ క్రింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథని రాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.

"విడాకులే ముందు.... పెళ్ళి తర్వాత" ఖచ్చితంగా చెప్పాడు సుధీర్.